క్లుప్తంగా

చిన్నారి నైపుణ్యం.. పప్పుదినుసులతో దేశ పటం


భారతదేశ పటంతో చిన్నారి బిన్ని

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో యుకేజీ చదువుతున్న బిన్ని అనే విద్యార్థిని పప్పు దినుసులతో భారత దేశం పటాన్ని తయారు చేసి ఔరా అనిపించింది. విద్యార్థులతో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ బుస్సా సులోచన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజియా, కరుణ, నాగమణి పాల్గొన్నారు.

రూ.50 వేల విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం ఆవరణలో భోజనశాల నిర్మాణానికి రంగారెడ్డి జిల్లాకు చెందిన సారగండ్ల మోహన్–విజయలక్ష్మి దంపతుల కూతురు అప్పిత రూ.50 వేల విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవ సలహాదారుడు పసుపులేటి భిక్షం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలని వినతి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు మాట్లాడుతూ కోనో కార్పస్ చెట్లతో ప్రజలతో పాటు పసుపక్షాదులు తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురి అయ్యే ప్రమాదం ఉందని, కావున ఆ చెట్లను వెంటనే తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు రావుల సత్యం, ఎల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఖరీముల్లా, శంకర్, సంతోష్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆట బొమ్మలు బహూకరణ

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అదే గ్రామానికి చెందిన నాయిని శ్రీనివాస్ రూ. 3వేల విలువ గల ఆట బొమ్మలను బహూకరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు దాత శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

నేడు సమీక్షా సమావేశం

చిలుకూరు : చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తాగునీటి సమస్యపై మండల స్థాయి సమీక్షా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ బండ్ల ప్రశాం తీకోటయ్య, ఎంపీడీఓ ఈదయ్యలు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

19న దళిత బహుజన మహాసభ

గరిడేపల్లి : మండలంలోని పోనుగోడులో మార్చి 19న ఉమ్మడి నల్లగొండ జిల్లా దళిత బహుజన మహాసభను నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందిపాటి ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభ కరప్రతాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దళితుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులు నాగయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాతంగి రమేష్, లక్ష్మయ్య, అశోక్, లతీఫ్, సత్తయ్య, మల్సూర్, శ్రీను, నాగరాజు, కనకరత్నం పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో మంగళవారం 10వ తరగతి ఇంటర్నల్ మార్కులను విద్యా శాఖ ఆధ్వర్యంలో పరిశీలించారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ డాక్టర్.శరత్‌బాబు, సభ్యులు షేక్.మేరావుద్దీన్, శౌరి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రైస్తవుల ఉపవాస దీక్ష

కోదాడఅర్బన్ : క్రైస్తవుల ఉపవాస దీక్ష బుధవారం నుంచి ప్రారంభమై 40 రోజులు కొనసాగుతుందని నయానగర్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్, కోదాడ నియోజకవర్గ యునైటెడ్ క్రిస్టియన్స్, పాస్టర్స్ అసోసియేషన్ నాయకుడు రెవరెండ్ డాక్టర్ వి.యేసయ్య మంగళవారం తెలిపారు. ఈ ఉపవాస దీక్షలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రభువును ప్రార్థించాలని కోరారు.

సరిపడా సాగు నీరివ్వాలి

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం గ్రామ పరిధిలో ఉన్న పాలారం మేజరు కాల్వకు సరిపడా సాగు నీటిని విడుదల చేయాలంటూ మంగళవారం ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు కాల్వ కట్టపై ఆందోళన చేపట్టారు. గత కొద్ది రోజులుగా చాలీచాలని నీటిని విడుదల చేస్తుండడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరిపడా నీరు విడుదల చేయాలన్నారు. తిరుమలరెడ్డి, జానీబాబు, వెంకన్న, రామిరెడ్డి, మట్టయ్య పాల్గొన్నారు.

పెరటి తోటలతో స్వయం ఉపాధి


సిరిపురంలో ఓ ఇంటి ఆవరణలో బెండ సాగు


రత్నవరంలో ఓ ఇంటి ఆవరణలో సాగు చేసిన గోరుచిక్కుడు

- ఖాళీ స్థలాల్లో వివిధ రకాల కూరగాయల సాగు
- రసాయన ఎరువులు ఉపయోగించకుండా పంటలు పండిస్తున్న కొందరు

నడిగూడెం: ఇళ్లలో ఖాళీ స్థలం ఉంటే చాలు కొందరు రైతులు వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, తీగ జాతి కూరలను సాగు చేస్తున్నారు. కూరగాయలను ఇతరులకు విక్రయిస్తూ కొంత మేరకు స్వయం ఉపాధి పొందుతున్నారు. మండల కేంద్రంతో పాటు, చెన్నకేశ్వాపురం, కరివిరాల, రామాపురం, ఎక్లాస్‌ఖాన్‌పేట, వల్లాపురం, రత్నవరం, శ్రీరంగాపురం, నారాయణపురం తదితర గ్రామాలకు చెందిన పలువురు తమ ఇళ్లల్లో ఖాళీ స్థలాల్లో పలు రకాల కూర గాయల పంటలను సాగు చేస్తున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులను ఉపయోగించకుండా నాణ్యమైన కూరగాయలను, ఆకు కూరలను పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రసాయన మందులు ఉపయోగించకుండా..

సాధారణంగా పెద్ద కమతాల్లో సాగు చేసే కూరగాయల క్షేత్రాలకు రసాయన ఎరువులు, పురుగు మందులను విపరీతంగా పిచికారీ చేస్తుంటారు. కానీ, ఇంటి పెరటి తోటల్లో ఎలాంటి రసాయన మందులను ఉపయోగించకుండా నాణ్యమైన కూరగాయలను నిత్యం తింటున్నారు. పలువురు తమ కుటుంబాలకు సరిపోవడంతో మిగిలిన తాజా కూరగాయలను పక్కిళ్ల వారికి, మార్కెట్‌లలో తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. పెరట్లలో ఈ తాజా కూరగాయల సాగు చేపట్టడంతో బయట మార్కెట్‌లో కూరగాయలను కొనుగోలు చేసే ఇబ్బంది తగ్గడంతో పాటు, డబ్బు కూడా ఆదా అవుతోంది. దీంతో పాటు ఆరోగ్యవంతమైన కూరగాయలను తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నామని పేర్కొంటున్నారు.

ఇళ్లల్లో సాగు చేస్తున్న కూరగాయలివే..

వంగ, బెండ, టమాట, చిక్కుడు, గోకర, దొండ, సొర, కాకర, పొట్ల, బీర, పాలకూర, తోట కూర, బచ్చలకూర, మెంతికూర, గోంగూర, పసుపు, తదితర కూరగాయలను సాగుచేసుకుంటున్నారు. వీటితో పాటు పలువురు తమ పెరట్లలో మామిడి, అరటి, సపోట, జామ, మునగ, ఉసిరి, నేరేడు, కరివేపాకు, తదితర మొక్కలను కూడా పెంచుకుంటున్నారు.

తాజా కూరగాయలు తింటున్నాం



పదేళ్లుగా ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో కూరగాయలను సాగు చేస్తున్నాం. వంగ, టమాట, కాకర, బెండ, చిక్కుడు, దొండ, సొర, పలు రకాల ఆకు కూరలను పండిస్తున్నాం. నిత్యం తాజా కూరగాయలను తింటున్నాము. ఆరోగ్యంగా ఉంటున్నాం.

– గందర్తి నాగమ్మ, నారాయణపురం

మేము తింటూ ఇతరులకు విక్రయిస్తున్నాం



ప్రస్తుతం మార్కెట్‌లో రసాయన పురుగు మందులు వాడిన కూరగాయలు లభిస్తున్నాయి. దీంతో 10 సంవత్సరాలుగా ఇంటి ఆవరణలో అనేక రకాల కూరగాయలు సాగు చేస్తూ, మేము తింటూ ఇతరులకు తాజా కూరగాయలు విక్రయిస్తున్నాము. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మా ఇంటి కూరగాయలు తీసుకెళ్తున్నారు.

– బెల్లంకొండ రామస్వామి, రత్నవరం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారుతోంది


హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేశం

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని బీజేపీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేశం ఆరోపించారు. ప్రజా గోస – బీజేపీ భరోసాలో భాగంగా మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణాలో మద్యం అమ్మకం ద్వారా ప్రభుత్వానికి రూ.40 వేల కోట్ల ఆదాయం వస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ వేసినా, భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచినా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మాత్రం రోజురోజుకూ దిగజారుతోందని విమర్శించారు. రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన సీఎం కేసీఆర్ దేశాన్ని ఎలా ఉద్ధరిస్తాడని ప్రశ్నించారు. దేశ సంపదపై కన్నేసి బీఆర్ఎస్ పేరుతో జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, మీటింగ్ కో–ఆర్డినేటర్ ఎం.చంద్రారెడ్డి, బూత్ కమిటీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ గోపినాథ్, బూత్ అధ్యక్షుడు నాగరాజు, రంగనాథ్ నాయకులు గంధం సతీష్, మంద వెంకటేశ్వర్లు, దేవిశెట్టి మురళి, పరందామయ్య, సైదులు, అభినవ్‌రెడ్డి, సాయి పవన్, బూత్ సభ్యులు ఉన్నారు.

బీఆర్ఎస్ వైఫల్యాలను వివరించాలి

కోదాడరూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల్లోని ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నూనె సులోచన అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గణపవరంలో ప్రజా గోస– బీజేపీ భరోసా శక్తి కేంద్ర కార్నర్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల్లో హామీలు ఇచ్చి మరిచిన నిరుద్యోగ భృతి, రైతు రుణ మాఫీ, దళితులకు మూడెకరాల భూమి వంటి వాటి గురించి గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. అదేవిధంగా బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మేకల నాగరాజు, బంగారయ్య, నాగేశ్వరరావు, హరి, కనగాల నారాయణ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పోడు రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి

పాలకవీడు : పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని చెరువుతండా గ్రామంలో నిర్వహించిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు రైతులకు హక్కు పత్రాలు అందిస్తామన్న ప్రభుత్వ హామీని స్వాగతిస్తున్నామని, కానీ సాగు చేసుకుంటున్న గిరిజనులందరికీ పట్టాలివ్వాలన్నారు. మండలంలో వేల సంఖ్యలో గిరిజనులు హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే, కేవలం పదుల సంఖ్యలో రైతులను ఎంపిక చేశారని అన్నారు. 2006 గిరిజన ఆదివాసీ చట్టాలను కేంద్రం నిర్వీర్యం చేయాలని చూస్తుందని ఆరోపించారు. ఎలాంటి నిబంధనలు లేకుండా సాగు చేస్తున్న రైతులకు హక్కు కల్పించాలని లేదంటే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బానోతు పాండునాయక్, రాజు, వెంకటేశ్వర్లు, వీరభద్రం, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

కోదాడఅర్బన్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఇటీవల ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పంచామృత అభిషేకాలు, ఆకుపూజ, పుష్పాలంకరణ, మహార్నివేదన, తీర్థప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో 700 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి అంజయ్య, కార్యదర్శి తిరుపతయ్య, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి హనుమంతరావు, అన్నదాతలు కారంశెట్టి వెంకటరమణ, సుగుణ, గుండు అప్పారావు, వంగవీటి నాగరాజు, కృష్ణమూర్తి, సత్యం, చారి, వంశీకృష్ణ, అప్పారావు, రామారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు

- ఆర్డీఓ కిషోర్‌కుమార్


సమావేశంలో పాల్గొన్న ఆర్డీఓ కిషోర్‌కుమార్, అధికారులు

కోదాడరూరల్ : అర్హులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించబడతాయని ఆర్డీఓ కిషోర్‌కుమార్ తెలిపారు. పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఏర్పాటు చేసిన సర్వే టీం అధికారులతో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన వారి పేర్లే జాబితాలో ఉండే విధంగా చూడాలని సూచించారు. పారదర్శకంగా సర్వే చేయాలని, ఎలాంటి ఆరోపణలకు తావివ్వవద్దని అన్నారు. ప్రజలు లబ్ధిదారులు దళారులను నమ్మి మోసపోవద్దని, లాటరీ పద్ధతిలోనే ఎంపిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసశర్మ తదితరులు ఉన్నారు.

కంటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి


వెంకట్రాంపురంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

గరిడేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని వెంకట్రాంపురం, రామచంద్రాపురం గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలను వారు సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కంటి చూపు సమస్యలను పరిష్కరించేందుకు ఎంతో కృషి చేస్తుందన్నారు. పరీక్షలు నిర్వహించిన తరువాత అవసరం ఉన్నవారికి కళ్ల అద్దాలను ఉచితంగా ఇస్తుందన్నారు. అనంతరం వసతుల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వనజ తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాలి


మొక్కలకు నీరు పోస్తున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : హరితహారంలో నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ కోరారు. మండల పరిధిలోని బూరుగడ్డలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను మంగళవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మొక్కలకు నీరు పోశారు. అలాగే ఉపాధి హామీలో చేపట్టిన పనులను పరిశీలించారు. తదనంతరం మొక్కలకు రక్షణగా ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. ఆయన వెంట పీఓ శైలజ, టీఏలు అరుణ, శైలజ, నాగలక్ష్మి, మొగలాబీ, ఉపాధి సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై శ్రద్ధ చూపాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ మౌలాన, మహిళలు

హుజూర్‌నగర్‌రూరల్ : ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలించడంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీఓ మౌలాన అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కరక్కాయలగూడెంలో స్వచ్ఛ భారత్ మిషన్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ కీత జయమ్మధనమూర్తితో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామ పారిశుద్ధ్య ప్రణాళికపై సర్వే నిర్వహించడంతో పాటు ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలించడానికి స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వస్తువుల వాడడంతో వచ్చే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతకుంట్ల కల్పన, సూర్యాపేట ఎస్‌బీఎం కోఆర్డినేటర్ హరి, ఏపీఓ శైలజ, ఏపీఎం, కార్యదర్శులు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఈఏలు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

హుజూర్‌నగర్ : నల్లగొండ జిల్లా కోర్టుకు ఒక కేసు విషయంలో హాజరై తిగిరి హైదరాబాద్ వెళ్తున్న రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది నారపాక సురేందర్‌ను మార్గమధ్యంలో కొందరు దౌర్జన్యం చేసి చంపుతామని బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు బుధవారం న్యాయవాదులంతా కలిసి తమ విధులను బహిష్కరించి నిరసన తెలియజేయనున్నట్లు చెప్పారు. న్యాయవాదులను భయభ్రాంతులకు గురిచేస్తున్న సాంఘికశక్తుల ఆగడాలను సాగనీయమని అన్నారు.

బీపీ, షుగర్ కిట్స్ పంపిణీ


పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మఠంపల్లి : ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం బాగుండాలని అమలు చేస్తున్న ఆరోగ్య సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మట్టపల్లి సర్పంచ్ దాసరి విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ కోరారు. మంగళవారం మట్టపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్‌సీఎల్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీపీ, షుగర్ పరీక్షల క్యాంపును వారు ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం ఇస్తున్న బీపీ, షుగర్ కిట్స్‌ను పంపిణీ చేసి, ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదును ప్రారంభించారు. మురళి, అయ్యప్ప, ముత్తయ్య, సాయి, నరసింహ, వాణి, లోకుశ్వరి, లక్ష్మీతాయారు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనను జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


హుజూర్‌నగర్ : గిరిజన నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన బంజారా భవన్ ప్రారంభోత్సవానికి బుధవారం రానున్న గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని బంజారా భవన్‌ను ఆయన సందర్శించి అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మంత్రుల పర్యటన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఎకరం విస్తీర్ణంలో రూ.1.5 కోట్లతో గిరిజన సంస్కృతి ప్రతిబింబించే విధంగా బంజారా భవన్ నిర్మించినట్లు తెలిపారు. భవన్ ప్రారంభానికి వచ్చే మంత్రులకు గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆటపాటలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మఠంపల్లి జెడ్పీటీసీ జగన్‌నాయక్, జయంతి కన్వీనర్ చంద్రమౌళి, గిరిజన నాయకులు కొండానాయక్, నవీన్‌నాయక్, జి.కృష్ణ, భరత్, తులసీరామ్, నగేష్, వీటీ, రాములు, ప్రజాప్రతినిధులు జయబాబు, శ్రీలతారెడ్డి, కె.వెంకటరెడ్డి, రంగాచారి, పి.సుజాత, బీఆర్ఎస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, దొతిరెడ్డి పద్మ, ఇరుగు పిచ్చయ్య, రవి, కె.వెంకటరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం

గరిడేపల్లి మండలం తాళ్లమల్కాపురానికి చెందిన వై.సాయి భారత సైన్యంలో ఉద్యోగం సాధించాడు. మంగళవారం అతను ఎమ్మెల్యే సైదిరెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయిని.. ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. నాయకులు కె.వెంకటరెడ్డి, కుక్కడపు గురవయ్య తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'తో చీకట్లు దూరం

హుజూర్‌నగర్‌రూరల్ : కంటి వెలుగు పథకంలో చీకట్లు దూరమై ప్రజలు కొత్త వెలుగులు చూస్తున్నారని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వేపలసింగారంలో గల ఆర్‌సీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, ఉపసర్పంచ్ కర్నె సావిత్రి, వెంకటరెడ్డి, ఎంపీఓ మౌలాన, కార్యదర్శి నాగమణి, కొండారెడ్డి, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బంజారా భవన్ ప్రారంభోత్సవం

మఠంపల్లి : హుజూర్‌నగర్‌లోని రామస్వామి గట్టు వద్ద అధునాతన సౌకర్యాలతో నిర్మించిన బంజారా భవన్‌ను ఈనెల 22న మంత్రులు సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, సైదిరెడ్డిలు ప్రారంభిస్తారని, ఈ ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య మంగళవారం కోరారు. సమావేశంలో ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ తదితరులున్నారు.

కబడ్డీ పోటీల్లో 'ప్రో ఆటగాళ్ల' సందడి


కబడ్డీ క్రీడలో పాల్గొన్న క్రీడాకారులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం (జాతర) సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మేళ్లచెరువులో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. కాగా ఈ పోటీల్లో ప్రో కబడ్డీ జట్టు సభ్యులు తెలుగు టైటాన్స్ కెప్టెన్ సిద్ధార్ద్ దేశ్‌రాయ్, మోను గోయత్, మల్లికార్జున్, ఆశీష్‌సింగ్ పాల్గొని సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలి


హుజూర్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న పాండు

హుజూర్‌నగర్ : దేశంలో పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.పాండు అన్నారు. మంగళవారం పట్టణంలోని అమరవీరుల స్మారక భవనంలో రెడ్ బుక్ డే సందర్భంగా భారత విప్లవ కెరటం భగత్‌సింగ్ అనే అంశంపై మాట్లాడారు. స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్ సింగ్ చేసిన పోరాటం, త్యాగం నేటి యువతకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పి.వెంకట్ రెడ్డి, బ్రహ్మం, వి.సైదులు, పి.హుస్సేన్, సుందరమహేశ్వరరెడ్డి, టి.యోనా, కౌన్సిలర్ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం (అరిబండి భవనం)లో మంగళవారం రెడ్ బుక్ డే సందర్భంగా ఎర్ర పుస్తకాలను పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి కె.నగేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21వ తేదీన రెడ్ బుక్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత విప్లవ పోరాటయోధుడు భగత్‌సింగ్ పోరాట పుస్తకాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిరుపతయ్య, నీలా రామ్మూర్తి, శ్రీను, శ్రీనివాస్‌రావు, వెంకన్న, కోటయ్య, ఏసు తదితరులున్నారు.

ప్రభుత్వ భూమిలో పేదల గుడారాలు


నారాయణపురంలోని ప్రభుత్వ భూమిలో గుడారాలు వేసుకున్న కాలనీ వాసులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పలువురు డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి గుడారాలు వేసుకున్నారు. కాలనీలో ఒక్కో ఇంట్లో పదిమంది వరకు ఇబ్బంది పడుకుంటూ ఉంటున్నామని, ఈ విషయాన్ని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తాము ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నామని అంటున్నారు. ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెప్పి నేటికీ అర్హులమైన తమకు ఎలాంటి ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. ఇళ్లు లేక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్ : పపట్టణంలో తెలంగాణ లంబాడీ హక్కుల పోరాట సమితి సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగునాయక్ అధ్యక్షతన బంజారా రమేష్ మహారాజ్ పర్యవేక్షణలో గిరిజన నాయకులు భోగ్ బండార్, ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జీవితం అనుసరణీయమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దశరథ్ నాయక్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు బాల్సన్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బానోత్ వెంకట్రాం, ఎంఈఓ సైదానాయక్, నాయకులు బాబునాయక్, లకావత్ సైదులు, కె.మధు, మర్రి యశోద, చికూరి లీలావతి, పి.రమేష్, బి.రామజోగి, అలీ, నాగయ్య, జెడ్పీటీసీ జగన్, మాజీ ఎంపీపీ కొండానాయక్, నవీన్, రవి, సైదా, వీటి, సైదుల్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి


జాబ్ మేళా వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోదాడ : విద్యావేత్త, టీఆర్ఎస్ నాయకుడు కన్మంత రెడ్డి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 25న కోదాడలోని పెరిక హాస్టల్‌లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు కోరారు. మంగళవారం కోదాడలో జాబ్‌మేళా వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాలో 72 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని, దాదాపు 9 వేల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కోదాడ ప్రాంతంలో మునుపెన్నడూ లేని విధంగా నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో కోదాడ ప్రాంత నిరుద్యోగులు పాల్గొని ఉద్యోగాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో యువసేన నాయకులు రావి రవి, దున్నా ప్రవీణ్, కిరణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.